# ఔనౌను

– గోపన్నకు – ఏవిచారమూ లేదు:

పెళ్ళాంమాత్రం పుట్టెడు దుఃఖంతో ఉంటుంది, ఎప్పుడు చూచినా; ధుమ ధుమలాడుతూ అన్నా ఉంటుంది: అక్షులూ – పక్షులూ హడలేట్టూ, – తన్నూ, – కనిపెంచి, పెద్దవాన్ని చేసి, – పీడ వదుల్చుకున్నట్టు, చివరికి యీ నిర్భాగ్యుడికి అంటకట్టిపోయిన తలిదండ్రులనూ, కడుపున ఒక్కకాయన్నా కాయించకుండా, – కచ్చపట్టినట్టు ఆ రవంత వరమూ యివ్వడానికి మొగమొగాలు చూసుకుంటూన్న దేవాదిదేవులనూ – వాళ్ళకు పితృ పితామహాదులంటూ ఉండేవాళ్ళనూ – తిట్టి దుమ్మెత్తిపోస్తూ ఉంటుంది:

అలా ఏప్పుడూ, నోరు మూతపడకుండా ఆడిపోసుకుంటూ ఉంటుందంటే ఆ యిల్లాలులోపం ఎంతమాత్రమూ లేదు: గోపన్న ఏదీ పట్టించుకోడు: బెల్లంకొట్టిన రాయల్లే మిన్నువిరిగి మీద పడుతూన్నా తన్నుకానట్టు, నిశ్చింతగా ఉంటాడు: ఇంట్లో, అపూటకన్నా వండి వార్చేందుకు – ఉప్పూ పప్పూ నిండుకున్నాయన్న విచారంలేదు: ఇంటిఇల్లాలికి, – మెడలో పసుపుకొమ్ము తప్ప – చిన్నం ఎత్తు పుస్తెన్నా లేకపోయెనే అన్న విచారం లేదు–

– "అంతా రాముడి కరుణ – అన్నింటికీ ఆ దయాసింధువే ఉన్నాడు" – ఇలా శ్రీరంగనీతులు చెపుతూంటే, – తనకన్న వేయిరెట్లు దరిద్రంలో మునిగి తేలి, తరించిన భక్తుల చరిత్రలు నిదర్శనంగా ఏకరువు పెడుతూంటే, – ఒళ్లు మండుకురాదూ? – అయనకు ముదిరిన వేదాంతం ఆడకూతురికి ఎలా అబ్బుతుందీ?–

ఎప్పుడూ చీటికీ మాటికీ కజ్జాతప్పదు – అది రగిలి – రగిలి, – రోజువిడిచి రోజన్నా పస్తులుండటం తప్పదు – ఇదంతా కూడా ఆ రాముని కరుణే! – ఏదన్నా ఓ కారణం అంటూ కనబడితే – ఆ పూటకు పొయిలోపిల్లి లేవకపోయెనే – అనే ధ్యాసే పోతుంది: ఇలా కాగా, – కాగా ఏనాటికైనా, – ఈ రెండు పూటలా భోజనంకోసం అంగలార్చడం – ఉదరం మీద ఉండే ఈ మమతా, క్రమంగా సన్నగిలిపోయి – ఇవన్నీ తుచ్ఛ ఐహిక ప్రమేయములనీ, – రామనామామృతం సేవించితే, – ఆకలి దప్పులు జన్మజన్మలకూ ఉండవనీ, – అందు లవలేశమన్నా వంటపడితే, – అసలు మళ్ళీ జన్మంటూ ఉండదనీ, – అందుకు, – ఆ సుమూహూర్తానికి, – యిప్పుడు పడుతున్నామనుకున్న యాతనలన్నీ, – దోహదములనీ, – ఇలా తపించగా తపించగా – ఆ తరుణం రాకమానదనీ, – గోపన్న ఎన్నోవిధాల నచ్చచెప్పాలని యత్నించాడు కాని, ప్రయోజనం లేకపోయింది:

లేకపోగా, – ఆనాటి కానాటికి ఆవిడ హఠం మితిమీరి పోయింది. అందరికిమల్లే తానూ ప్రయోజకుడై, – నలుగురి యిల్లాళ్ళలో తను తలయెత్తుకుని తిరిగేట్టు నిర్వాహకం చేయకపోతే, – ఇహ, ఒక్క క్షణం యీ కాపురం చేయలేనంది: ఏ గంగలోనన్నా దిగుతానంది; అంత అఘాయిత్యం సాగకపోతే – అధమం పుట్టింటికైనా పోతానంది: ఆ ఎత్తే ముష్టి – నష్టీ అక్కడే యెత్తుకు తింటానంది: తనూ, తన శ్రీరామచంద్రమూర్తీ కలిసి, ఎల్లకాలమూ ఉట్టికట్టుకు ఊరేగమంది: కుచేలోపాఖ్యానం, మహాభక్త విజయం కలిపి చలిమంట వేయమంది – ఇది ఏదో తేలేదాకా, గంగ ముట్టనంది – మాటకు మాట జవాబు చెప్పవలసిన అవసరం లేదంది – చెప్పినా విననంది:

గోపన్న, – శ్రీరామచంద్రుడిపటానికి నమస్కారం చేసి – ఉత్తరీయం వేసుకుని వీధిలోకి వెళ్ళిపోయాడు: ఇది, ఆ యింట మామూలే! –

వెళ్ళడం, తిరిగి మళ్ళీ పూజవేళకు యిల్లుపట్టడం – ఇదీ మామూలే! –

– అతడు – అటు వెళ్లాడోలేదో, – ఎవరో పెద్దమనిషి – "గోపన్నగారు ఉన్నారా?" అంటూ వచ్చాడు: "ఉన్నారా అమ్మా?" అని ఆ యిల్లాలిని పలుకరించాడు.

"లేరు!–" అని ఆమె రుసరుసలాడింది.

"ఎప్పుడొస్తారు?"

"ఏమో!–"

"భోజనం వేళకు –"

– ఆ యిల్లాలు ఛర్రుమంటూ లేచింది –

"లేరంటే పోరాదూ? – ఎవరయ్యా మీరు – మీకేం బాకీ ఉన్నారా?–"

ఆ పెద్దమనిషి, – మృదువుగానే –

"వారి దర్శనానికి వచ్చానమ్మా?–" అన్నాడు:

"అఁ – అదే నేనంటూంట! – నాకు తెలుసు, వారి దర్శనానికే. ఆయన్నూ నన్నూ నడిబజారులో పెట్టి వేలం వేసినా రాగిడబ్బు రాలదు–!"

– "ఈ ఇల్లాలేం పైత్యానపడ్డదా? –" అన్నట్టు విస్తుపోయి – ఆ పెద్దమనిషి – "అదేమిటి తల్లీ! – ఆయన దైవసమానులమ్మా! – " అని మాత్రం అని సెలవు పుచ్చుకున్నాడు.

ఆయన గడప దిగీదిగడంతోనే, – పూచిన తంగేడల్లే ఒంటినిండా నగలతో, – వయ్యారి నడకతో, – నవ్వుకుంటూ కలకలలాడుతూ, – "ఇది తప్పకుండా సానే!" అని తేలికగా అర్థమయ్యే వాలుచూపులతో, – మాంచి ఏపుమీద ఉన్న ఓ సింగారి, – అతి చొరవగా లోపలికి వచ్చి, – "అమ్మగారూ దణ్ణం!" అంటూ దగ్గిరగా కూర్చుంది:

"ఎవరు నీవు? –" కొట్టొచ్చినట్టు అడిగింది ఆ యిల్లాలు, చూసీ చూడటంతోనే, కళ్ళుకుట్టి –

"అయ్యగారు ఉన్నారా అమ్మా?"

"ఏం – మా ఆయనతో నీకేం పని? –"

"ఉంది! –"

"ఉందీ? ఎత్తింది ఆడపుటక కాదూ, సిగ్గులేదూ? – పట్టపగలు నడిబజారుగుండా నడచివచ్చి – ఆయనతో పనుందంటావ్? – ఈ ఇంటోకి నిన్నెవరు రమ్మన్నారు. మింగమెతుకు లేదుగాని, – మధ్య మాకు ఇదో తంటసమా? – ఇదా, భక్తి? – కనుక్కుంటానుండు–!"

"అపచార మమ్మా!–"

"నాకు నీతులు బోధిస్తావుటే – నీ బ్రతుకెంత, నీవెంత–"

"ఔనమ్మా! – నా మనవి ఆలకించండి!–"

"ఏమిటా మనవి?–"

"ఇదె!–"

– వెయ్యి మొహరీలున్న మూట, చెంగున తీసి, ఆ యిల్లాలి ముందు ఉంచింది – "మీదేనమ్మా – మా ముత్తవ తల్లికి అయ్యగారు, – ఏదో చల్లనిముక్క ఏనాడో చెవిని వేశారు: అదే స్మరించుకుంటూ, సుఖంగా కాలంవెళ్ళబుచ్చుకుంది: చివరి ఘడియల్లో నాకు చెప్పిపోయిందమ్మా – సరిగా నాటికి ఏడాదినాడు, – అయ్యగారికి ఈ తృణం సమర్పించి, – స్వీకరించమని ప్రార్థించానని మనవిచేయమన్నదమ్మా – నేను మనోహరినమ్మా – మీ దర్శనం యీ రూపేణా చేసుకున్నాను – కాని, అప్పుడప్పుడు అయ్యవారి పాదాలు కళ్ళకు అద్దుకుంటాను –"

మొగాన బొట్టుపెట్టి, – చేత తాంబూలం ఉంచి, – ముల్లె అందించి సాగిలి మ్రొక్కింది –

"అదేమిటే నీ యిల్లుబంగారంగానూ – నాకు మొక్కుతావెందుకే – నీవు మంచిదానవు గనుక – మీ ముత్తవతల్లి మాట దక్కించావు! మరొకళ్ళయితే – అప్పుడు తల ఊపినా, – యింత సొమ్ము చేజార విడుచుకుంటారా? – నీకు పిల్లలెందరు? – ఎన్నడన్నా వచ్చి చూసి పోతూండు –"

మనోహరి సెలవు తీసుకుని వెళ్ళిపోయింది – మరో గడియకు గోపన్న వచ్చాడు – వచ్చీరావడంతోనే, – యిల్లాలు గునగునలాడుతూ, – "ఏమండోయ్!–" అంటూ గంతులేసినట్టు వచ్చి, కంఠం పెనవేసుకుని, – గుక్కతిప్పకుండా చెప్పివేసింది – ముల్లె కళ్ళఎదుట గలగల లాడించింది –

"రామా!–" అన్నాడు గోపన్న నిట్టూర్పుగా – "పుచ్చుకున్నావా?" అన్నాడు.

"అదేమిటండీ? – పుచ్చుకోక చేదా?–"

"కాదుటే, – వెర్రిదానా?–"

"ఇహ మీ వేదాంతం చాలించండి – లెండి భోజనానికి –"

– ఇలా అంటూండగానే, – యిందాకటి పెద్దమనిషి మళ్ళీ చక్కా వచ్చాడు, గోపన్నకు మ్రొక్కాడు – చూసీ చూడటంతోనే, – ఆ యిల్లాలు నవ్వు మొగంతో, – "దయచేయండి బాబూ!" అని ప్రత్యుత్థానం చేసి, – "ఇంతకు ముందు ఒకసారి వచ్చి వెళ్లారండీ, 'వస్తారు ఉండండి!' అందామనుకుంటూండగానే చక్కాబోయినారు – వారిని కూడా భోజనానికి ఉండమనండి–" అంటూ లోపలికి చక్కాబోయింది.

"ఎవరుబాబూ తమరు?" గోపన్న ఎంతో వినయంగా పలుకరించాడు: వచ్చిన పెద్దమనిషి, అదాటున గోపన్న పాదము లందుకుని కళ్ళకు అద్దుకున్నాడు.

"అదేమిటి బాబూ!" అని గోపన్న కలవరపడుతూ తప్పుకుని, లేవనెత్తాడు –

"అంతే అయ్యా!–ఇందుకోసం ఇన్నాళ్లూ తపించాను–ఇప్పటికి తరించాను –"

"కొన్నేళ్ళక్రితం – గోదావరి స్టేషనులో, రాత్రిపూట మీరు నిద్రపోతూండగా, – మీరొండినున్న మూడు – పచ్చనోట్లూ మాయమైనాయ్, కాదూ? తీసింది, నేనే – అప్పటికి నాకు అదేవృత్తి – కాని, ఆ సొమ్ము వచ్చిన వేళావిశేషాన ఆనాటినుంచీ నేను పట్టింది బంగారమైంది: అనుకోకుండా, ఏమీ యత్నంలేకుండా, అన్నీ కలిసివచ్చినవి వాటంతట అవే:

"నేను మళ్ళీ ఎన్నడూ నీచానికి దిగలేదు – మీ సొమ్ము విడిగా వర్తకంలో తిప్పాను–వృద్ధి అయింది – మనవిచేసుకుందామని వచ్చాను – అనుగ్రహించరా!–"

గోపన్న ఆశ్చర్యపడలేదు – కనురెప్పైనా కదలించలేదు.

"శ్రీరాముడికి దయకలిగింది నాయనా!–ఆ కొంటెవాడు ఎప్పుడూ యింతే–"

ఇల్లాలు, – లోపలికి వెళ్ళినట్టు వెళ్ళిందేకాని, – లోగుమ్మంలో నిలుచుని, ఇదంతా ఆలకించింది – కళ్ళింతలు చేసుకుని–

"ఏంబాబూ, – ఏమాత్రం వృద్ధి అయింది?–" అన్నది –

"లక్షరూపాయలు దాటుతుందమ్మా!–యీ యేటి లాభాలు కలుపలేదింకా?–"

"నా ఉనికి ఎలా తెలిసింది నాయనా!–" అని గోపన్న కించపడుతూ అడిగాడు–

"ఆనాడు పైకంతోబాటు రైలు టిక్కెట్టుకూడా ఉందికదా బాబూ:– ప్రయాణం ఎక్కడికో తెలిసింది – యాదాలాపంగాచూసి, – మీ పక్కనే జారవిడిచాను – తరువాత కొన్నాళ్ళకు యీ ఊరువచ్చి జాడలు తీశాను – మీ దర్శనం చేశాను: అప్పుడప్పుడువచ్చి మీకంటపడకుండా, దూరాన్నుంచే మ్రొక్కి పోతూండేవాడిని – ఈ మాత్రమైనా కూడబెట్టి, అప్పుడొచ్చి, మీ పాదాలదగ్గిర వ్రాలుదామనుకున్నాను: ఈనాటి కది సిద్ధించింది:–"

ఉన్నంతలో, భుజించి ఆ పెద్దమనిషి, – సెలవు తీసుకున్నాడు. తనకు అగత్యం లేదు, – ఆ సొమ్ము తన యిల్లాలి పరం చేయవలసిందని, గోపన్న, – అతడలా ప్రాధేయపడుతూంటే అసలు కాదనలేక, ఒప్పుకున్నాడు –

– "ఇవాళ లేచినవేళ ఎటువంటిదండీ!" అని ఆ యిల్లాలు కలకలలాడింది. చిటిపోటి పోణెములు ఎన్నో చేయబోయింది: తాము, ముందుముందు, ఎలా సుఖపడిపోయేదీ, – ఇన్నాళ్లుగా మనసులోనే కుమిలి పాతమారిపోతూన్న ముద్దు మురిపెములన్నీ ఎలా తీర్చుకునేదీ, నోరునెప్పిలేకుండా ఏకరువు పెట్టేంది. అన్నీ విని, విని, – గోపన్న, –

"ఇంతటితోనైనా, కడుపు నిండినట్టేనా?" అని నవ్వుగా సౌమ్యంగా అడిగాడు –

"ఆహా! నాకింకే కోరికాలేదు: నేను పట్టిననోములు ఫలం లేకుండా పోతాయా? – ఇట్లాగే మళ్ళీ యీనాటికి మన నట్టింట ఉయ్యాలతొట్టె వేసుకుంటే–"

గోపన్నవంక కొత్త పెళ్ళికూతురల్లేచూసి సిగ్గుపడ్డది –

గోపన్నకు, – కన్ను తడి అయింది.

పూజామందిరం దగ్గిరకు వెళ్ళి – "అర్థం అయింది ప్రభూ!–" అని నవ్వాడు – వచ్చేశాడు –

– గోపన్న మళ్ళీ యింటికి రానేలేదు: ఎందరిని విచారించినా ఎవరికీ ఆచోకీ తెలియదు: ఎన్ని దేశాలు గాలించినా, జాడేలేదు: ఏమైపోయినాడో తెలియదు:

– వేసీవేయకుండా ఉన్న ఆ యింట్లో – ఆ యిల్లాలు ఒక్కతే – ఎప్పుడూ ఆ పూజామందిరందగ్గిరే కూర్చుంటుంది – "అర్థం అయింది ప్రభూ! అనుగ్రహించు!–" అని జపిస్తూంటుంది:

తొలిరోజుల్లో విలవిలా ఏడ్చేది – భయపడేది – ఇప్పుడు ఏ విచారమూ లేదు; అతిశాంతంగా ఉంటుంది – ఏనాటికైనా అతడు తిరిగివస్తాడనే నమ్మకం ఉంది – ఎప్పుడు వస్తాడో అనే ఆరాటం మాయమైంది – అలా, రాముణ్ణిచూస్తూ కూర్చోడం తప్ప, – ఆ యిల్లాలికి మరోకోరికే – ధ్యాసే – లేదు.

★ ★ ★